# పడిలేచే కడలితరంగం

--- కొమ్మనాపల్లి గణపతిరావు

జీవితం ఓ మహార్ణవమైతే అనుభవాలు కడలి కడుపున దాక్కున్న నదీ నదాల వంటివి. వివిధ తావులనుండి పరుగిడిన ప్రావాహాలు సముద్రాంతర్భాగంలో చేరి ఒకే రుచిని సంతరించుకున్నట్టే అనుభవాలు సైతం జీవితంలో అందంగా ఇమిడిపోయి ఒకే రాగాన్ని శృతి చేయగల సాధనాలు కావాలి. కాని నాడు జీవితమే ఓ చేదు అనుభవంగా మిగిలి పోతుంది.

0 0 0 0 0

### ఆ రాత్రి

కీర్తిశేషులైన రాజానరేంద్రదేవ్ లోగిలిలో స్తబ్దత ఆవరించుకుని ఉంది.

అలనాటి వైభవాన్ని అందంగా గుర్తుచేసే ఆ భవంతి లోని ఓ విశాలమైన గదిలో నరంద్రదేవ్ తనయులైన రంగనాధంగారు ఆయాసంతో రొప్పుతుంటే వారి ఏకైక పుత్రిక శిల్ప భయకంపితురాలవుతూ దిక్కు తోచని దానిలా సమీపంలో కూర్చుని ఉంది.

ఎన్నో ఏళ్ళుగా ఆ లోగిలిలో ఉంటున్న రంగనాధంగారి దూరపు బంధువు అన్నపూర్ణమ్మ కూడా కర్తవ్యం తోచక డాక్టరు కోసం నిరీక్షిస్తూ ద్వారంవేపు చూస్తూ నిలబడింది.

పల్లె పెద్దదైనా సమయానికి వైద్య సహాయం అందని ఆ ఊరి దౌర్భాగ్యం గురించి శిల్పకు బాగా తెలుసు. అందుకే హఠాత్తుగా తండ్రిగారికి గుండె నొప్పి రావడంతో ఫేమిలి దాక్టరయిన విశ్వాస్‌ను ఫోనులో పిలవాలని ప్రయత్నంచి రింగ్‌టోన్ రాకపోవడంతో ఆలస్యం చేయకుండా కారులో నౌకర్ని పంపింది.

నాన్న గారినే అనకాపల్లి తీసుకెళ్ళాలనుకుంది కానీ ఆమెకు ధైర్యం చాలలేదు.

కారణం అయిదు మైళ్ళు కుదుపులతో కూడిన కారు ప్రయాణం ఆయన ప్రస్తుత పరిస్థితికి క్షేమం కాదన్న భావం.

ఆమె ఆలోచనకు అంతరాయం కలిగిస్తూ పోర్టికోలో కారు ఆగిన చప్పుడైంది.

డాక్టర్ విశ్వాస్ గదిలోకి అడుగు పెట్టగానే తేలిక పడ్డ మనసుతో ‘గుడీవినింగ్ అంకుల్’ అంటూ పలకరించింది శిల్ప.

మగతగా కళ్ళు మూసుకుని ఉన్న రంగనాధంగారి బి.పి. చెక్ చేశాడు డాక్టర్.

నాన్నగారు సాయంకాలం ఏదోఆందోళన పడుతున్నట్టుగా ఇంటికి రావడం, ఒంటరిగా గదిలో కూర్చోవడం, భోజనాల వేళ పిలవాలని వెళ్ళేసరికి బయలుదేర బోతూ గుండె పట్టుకుని మెలికలు తిరిగిపోవటం అంతా శిల్ప వివరించి చెపుతుంటే మౌనంగా వింటూ ఓ ఇంజక్షను చేశాడు.

కొన్ని కేప్సూల్స్ ఇచ్చి ఇవి ఎప్పుడెప్పుడు వాడాల్సింది వివరించాడు.

‘అంకుల్...’

వెళ్ళబోతున్న డాక్టర్ విశ్వాస్ శిల్ప కళ్ళలోని భయం చూసి లాలనగా తలనిమిరాడు.

'నథింగ్ టు వర్రీ ..... మైల్డ్ స్ట్రోక్ ....అంతే !'

'నాకేదో భయంగా వుంది అంకుల్.'

'నోనో... భయంలేదని చెబుతున్నాగా..... వయసు మీద పడుతుంటే ఇలాంటి చిన్నచిన్న ప్రాబ్లమ్స్ తప్పవు మరి. రేపు ఉదయాన్నే వస్తాగా.'

ఆమెకు ధైర్యం చెప్పాడు.

బయటకు వెళ్ళబోతూ ఏదో గుర్తుకొచ్చినట్టుగా ఆగాడు.

'ఇవాళ మధ్యాహ్నం నుండి ఫోన్ అవుటాఫ్ ఆర్డర్ ... కాబట్టే ఫోన్‌లో నన్ను కాంటాక్ట్ చేయబోయి ఫెయిలయ్యావు. ఈ రాత్రికి ఇంకేం ప్రాబ్లమ్ ఉండదు కాబట్టి అనవసరంగా హైరానా పడకు.'

డాక్టర్ విశ్వాస్‌ను అనుసరించి, కారు బారులు తీరిన పూలతోట మధ్యగా ప్రయాణిం చేసి సింహద్వారం దాటేవరకూ అలాగే నిలబడింది.

అన్యమనస్కరంగా తండ్రి గదిలోకి నడిచి అలసటగా కనిపిస్తున్న ఆయన మొహాన్ని చూస్తూ కొంతసేపు ఉండి పోయింది.

డాక్టరు మాటలతో కొంత వూరట కలిగినా ఆమెలో అలజడి తగ్గలేదు.

భయంకరమైన ఒంటరితనం...

ఎవరూలేని తనకు నాన్నగారు కూడా కరువైతే....

గోడనున్న స్విచ్ గడియారంలోని పెండ్యులమ్ 'ధన్ ధన్' మంటూ పదిసార్లు మ్రోగి ఆగిపోయింది.

గదిలోకి అడుగు పెట్టిన అన్నపూర్ణమ్మ అవనతవదనయై కూర్చున్న శిల్పను చూసి రంగనాధం గారి అనారోగ్యం గురించి ఆరాతీసే సాహసం చేయలేక పోయింది.

పోనీ భోజనమైనా చేయమని బలవంతం చేద్దామన్నా శిల్ప ఎక్కడ కసురుకుంటుందోనన్న జంకు....

అది ఆ లోగిలిలో అనుశ్రుతంగా వస్తున్న ఆనవాయితీ.

అందుకే శిల్ప ఏమైనా అడుగుతుందేమోనన్న ఆశతో చాలాసేపు నిలబడ్డ అన్నపూర్ణమ్మ అలాంటి అవకాశం కనిపించక పోయేసరికి కిటికీలకున్న పరదాల్ని సర్ది మౌనంగా బయటకు నడచింది.

నాన్నగారికెందుకిలా అయిది.

దీని పర్యవసానం ఎలా వుంటుంది.

దేనినీ పట్టించుకోనట్టుగా వుండే నాన్నగారిలో సంఘర్షణకి కారణం ఏమిటి....

ఎడ తెగని ఆలోచనలు... జవాబు దొరకని ప్రశ్నలు.

ఆపాదమస్తకం కంపించిపోయింది.

ఆ సమయంలో ఆమెకు మరెవరి తోడై నా అవసరం అనిపించింది.

అన్నపూర్ణమ్మను పిలిచి ఆమె ఒడిలో తలపెట్టి బావురుమని ఏడవాలనిపించింది.

మృత్యువు పాదాలపై పడి నాన్నగారి మెడకు ఉచ్చు బిగించి తన గుండెల్లో చిచ్చు రేపొద్దని ప్రాధేయ పడాలనిపించింది.

రివ్వున వీచిన చలిగాలికి కిటికీ రెక్కలు టప టపమంటూ కొట్టుకొనేసరికి ఆమె ఆలోచనలు తెగిపోయాయి,

ఛీ ఛీ! ఏమిటి తనింత బేలగా ఆలోచిస్తుంది.

అసలిప్పుడు నాన్నగారికేమైందని.

ఆమె లోని స్వాతిశయం ఓదార్పు నందించింది.

కిటికీ రెక్కల్ని మూసి నాన్నగార్ని సమీపించి బ్లాంకెట్ ను మెడవరకు కప్పింది.

ఆమె దృష్టి అలవోకగా గోడపైనున్న నిలువెత్తు పోర్ట్రెయిట్ పైకి మళ్ళింది.

రాజానరేంద్రదేవ్.....

ఒకనాటి జమిందారు....

బ్రిటీష్ వారి కాలంలో మకుటంలేని మహారాజులా బ్రతికి అపరిమితమైన ఆస్తిని సంపాదించి ఎదురులేని వ్యక్తిగా ఎంతో ఘన కీర్తిని పొందగలిగిన మహామనిషి.

స్ఫురద్రూపంతో, రాజఠీవితో వెలగిపోతున్న తాత గారి వేపు గర్వంగా చూసిన శిల్ప అంతకంటే గర్వంగా నుదుటిపై అలుముకున్న నీటి బిందువుల్ని తుడుచుకుంది.

తాతగారు వేటాడి చంపిన పులితోలుతో చేయబడిన పులిబొమ్మ దక్షిణద్వారానికి కాపలా కాస్తున్నట్టుగా నిలబడి గత వైభవాన్ని గుర్తు చేస్తూంటే అంతసేపూ భీరువులా ఆలోచించిన తన తప్పిదాని కెంతగానో నొచ్చుకుంది.

అద్దంలోని ఆమె ప్రతిబింబం ద్విగుణీకృతమైన అభిజాత్యాన్ని ప్రదర్శిస్తుంటే ముగ్ధమోహనంగా ముందుకు నడవబోయి హఠాత్తుగా ఆగింది.

కార్పెట్‌పై పడివున్న ఎనవలప్‌ను అందుకుని యధాలాపంగా లోపలి కాగితాలను చూసింది.

తమ యావదాస్తి జప్తుకై సుప్రీకోర్టు ఇచ్చిన తీర్పు గురించి తమ తరపున వాదించిన సుప్రీంకోర్టు లాయర్ రామసుధీర్ రాసిన సుధీర్ఘ మైన లేఖ అది.

అసాంతం చదవగానే హఠాత్తుగా నాన్నగారు అనారోగ్యానికి ఎందుకు గురైనదీ నిర్ధారణ చేసుకుంది.

వణుకుతున్న చేతులతో కాగితాన్ని మడిచి నిస్సత్తువుగా సోఫాలో చతికిలబడింది.

నాన్నగారు అయిదులక్షలు అప్పుచేశారా.....

ఉండగా అంత అప్పు చేయాల్సిన అవసరం ఏం వచ్చింది.

నాన్నగారికి రేసుల పిచ్చి వుందని అందుకే అప్పుడప్పుడూ హైదరాబాద్, మద్రాసువంటి పట్టణాలకు వెళ్తుంటారని, ఉబుసుపోక తరచుగా క్లబ్బులకు వెళ్తుంటారని చూచాయగా తెలుసు తప్ప ఆ పిచ్చే ఇన్ని అప్పులకు ఇంతటి అవసరాలకూ దారి తీస్తుందని ఆమె ఏనాడు ఊహించలేదు.

అపరిమితమైన ఆస్తి అంచలంచలుగా హరించుకు పోతుందంటే కారణం ఇదమిద్దమని ఇన్నాళ్ళూ గ్రహించలేక పోయింది.

ఊరూ వాడా వేనోళ్ళ పొగిడే తాతగారి ప్రతిష్ఠ ఈనాడిలా అడుగంటి పోవటానికి నాన్నగారి దుర్వ్యసనాలే కారణమన్న ఆలోచన రాగానే ఆమె ఊపిరి అందనట్టుగా విలవిల్లాడిపోయింది.

బిల్డింగ్ రినవోయట్ చేయించమన్నా, తనకోసం ప్రత్యేకించి ఓ కారు కొనమన్నా నాన్నగారు ఇంతకాలం ఎందుకు తాత్సారం చేసిందీ ఆమెకు అర్ధమైంది.

తాతగారి కాలంనుండి తమనే నమ్ముకున్న కొందరు నౌకర్లని నాన్నగారు ఎందుకు తొలగించిందీ, అయిదారు నెలలుగా ఆయన ఎందుకు దిగులుగా వున్నదీ ఇప్పుడు అర్ధమైంది.

తాతగారి నిలువెత్తు చిత్రాన్ని, బీటలువారిన భవంతి గోడల్ని చూస్తుంటే ఆమెకు కళ్ళనీళ్ళు పర్యంతమైంది.

ఏమిటిది ?

ఏమైంది ఈ జమిందారి ప్రాభవానికి....

ఎన్నో తరాలకు సరి పడ్డ రాజానరేంద్రదేవ్ ఆస్తిపాస్తులు ఎందుకిలా హరించుకు పోయాయి.

మిగిలిన సంపదనైనా రక్షించుకోలేక తరతరాల వంశప్రతిష్ఠల్ని నడిబజార్లో అమ్మకానికి సిద్ధపరచిన తండ్రిని చూస్తుంటే ఆమె హృదయం తీరని వేదనకు గురైంది.

కిటికీ దగ్గర నిలబడి మసక వెన్నెల్లో సమాధుల్లా కనిపిస్తున్న పల్లెలోని పూరి గుడిసెల్ని, పల్లె నానుకొని నిశ్చలంగా ప్రవహిస్తున్న శారదానదిని చూస్తూ చాలాసేపు గడిపింది.

రంగనాథంగారు కాస్త తేరుకుని తిరగడం ప్రారంభించటానికి మరోరెండు రోజులు పట్టింది.

మూడవనాటి రాత్రి రంగనాథంగారే స్వయంగా శిల్ప గదికి వచ్చారు.

నిబ్బరంగా తిరిగే శిల్ప నిస్తేజకంగా కనిపించేసరికి ఆయన గుండె కెలికినట్టయింది.

చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కనబెట్టి యాంత్రికంగా లేచి నిలబడ్డ కుమార్తె ప్రవర్తన ఆయన దిగులును మరింత అధికం చేసింది.

ఏదో మాట్లాడాలని వచ్చిన రంగనాథంగారు కొన్ని క్షణాలపాటు గొంతు మూగపోయినట్టుగా ఉండి పోయారు.

జమిందారీ కుటుంబాల్లో బంధాలకంటే భేషాజాలకు ప్రాముఖ్యత అధికం... కాబట్టే బాల్యంలోనే తల్లిని పోగొట్టుకున్న శిల్పకు ఏ లోటు లేకుండా పెంచాలని ఆలోచించారు కాని ఆమె మానసికంగా ఎదగాలంటే మరేం కావాలో ఊహించలేక పోయారు.

భార్య మరణంతో మరింతగా దుర్వ్యసనాలకు అలవాటు పడిన రంగనాధంగారు శిల్పకు సరైన ఆప్యాయతనందించడంలో అశ్రద్ధ చూపటంతో ఆమె విచిత్రమైన మొండితనానికి అలవాటు పడింది. ఒక్కోమారు పెద్దా చిన్నా విచక్షణ మరిచి ప్రవర్తిస్తూ వుంటుంది. అందుకే ఆ లోగిలిలో అందరితో పాటు రంగనాధంగారు కూడా ఆమెతో చాలా క్లుప్తంగా మాట్లాడే ప్రయత్నం చేస్తుంటారు.

'నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలని వచ్చానమ్మా!' తటపటాయిస్తూ నిలబడ్డారాయన.

'మీరేం మాట్లాడాలని వచ్చారో, ఏ దుర్వా ర్త చెప్పాలని వచ్చారో నాకు బాగా తెలుసు.'

ఆమె కంఠంలోని ఎగతాళికి ఆయన తలవాలిపోయింది.

'ఎందుకు నాన్నగారూ తలవంచుకుంటారు. తాతగారి కీర్తికి తలవంపులు తెచ్చినందుకా లేక కన్నకూతురు ముందు మీ అసమర్ధతని అంగీకరించాల్చి వస్తున్నందుకా ?'

నిజానికి ఏ తండ్రీ కోరని దుస్థితి అది.